

డ్రోన్ చూస్తోంది!



బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా.. దొంగతనాలకు పాల్పడినా.. గంజాయి తాగి దౌర్జన్యాలు చేసినా.. ట్రాఫిక్ పోలీసులు లేరని వాహనాలను అడ్డదిడ్డంగా నడిపినా.. వాకింగ్‌కు వెళుతున్న మహిళల మెడల్లో నుంచి చైన్ లాక్కెళ్లినా.. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసినా.. జాతర్లలో చేతివాటం చూపినా.. డ్రోన్ చూస్తూ ఊరుకోదు. ఆయా సంఘటనల దృశ్యాలను ఫొటో, వీడియో రూపంలో పోలీసులకు చూపించి దుండగులకు బుద్ధి చెప్పనుంది.

- చిత్తూరు అర్బన్, ఆంధ్రజ్యోతి

నేరాల కట్టడి, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

నిఘా వ్యవస్థను మరింత పటిష్ఠం చేసిన పోలీసుశాఖ



కట్టమంచి చెరువు వాకింగ్ ట్రాక్ (డ్రోన్ ఫొటో)



పీవీకేఎన్ డిగ్రీ కళాశాల మైదానం (డ్రోన్ ఫొటో)

జిల్లాలో నేరాల కట్టడి, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా అధునాతన డ్రోన్ల సాయంతో నిఘా వ్యవస్థను పోలీసుశాఖ మరింత పటిష్ఠం చేసింది. డ్రోన్ల నిర్వహణకు జిల్లావ్యాప్తంగా 42మంది కానిస్టేబుళ్లకు శిక్షణ ఇచ్చారు. పోలీసుల సైతం వెళ్లలేని ప్రాంతాలకు డ్రోన్లను పంపిస్తున్నారు. పార్కులు, నిర్మానుష్య ప్రదేశాల్లో వీటి సేవలను వినియోగిస్తున్నారు.

విభిన్న ఫీచర్లు

ఈ డ్రోన్లలో డ్యూయల్ కెమెరా వ్యవస్థ ఉంటుంది. రెండు కెమెరాలను ఒకేసారి వేర్వేరుగా ఉపయోగించి.. విభిన్న కోణాల్లో ఫొటోలు, వీడియోలు తీయొచ్చు. ప్రొఫెషనల్ ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ కోసం వీటిని రూపొందించారు.

నాలుగు 'డీజేఐ ఎయిర్-3' డ్రోన్లు

జిల్లాలోని నాలుగు సబ్ డివిజన్లకు నాలుగు డీజేఐ ఎయిర్-3 డ్రోన్లను కేటాయించారు. ధర్నాలు, ఆందోళనలు, బహిరంగ సభలు, సమావేశాలు, గొడవలను చిత్రీకరించడానికి వీటిని వినియోగిస్తున్నారు. తిరునాళ్లలో, బహిరంగ సభల్లో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, జాతర్లలో చేతివాటాల కట్టడికి ఇవి ఉపయోగపడతాయి.

ప్రత్యేకతలు

'డీజేఐ ఎయిర్-3' డ్రోన్లు కిలోమీటరు ఎత్తువరకు ఎగురుతూ రెండు మూడు కిలోమీటర్ల విస్తీర్ణంలో జరిగే సంఘటనలను సైతం గుర్తిస్తాయి. సాంకేతికతతో అక్కడ ఎంతమంది ఉన్నారో కూడా లెక్కిస్తాయి. పగలు, రాత్రి తేడా లేకుండా ఫొటోలు తీస్తాయి. అగ్ని ప్రమాదాల్లో ఎంతమంది చిక్కుకున్నారో గుర్తిస్తాయి. ఏదైనా సంఘటన జరిగి.. అనుమానిత వ్యక్తి దాక్కున్నప్పుడు స్పాట్‌లైట్ వేసి కనిపెడతాయి.

సత్ఫలితాలు: కలెక్టరేట్ వద్ద జరిగే ఆందోళనలు, ధర్నాలు వంటి వాటికి ఇప్పటికే డ్రోన్లను వినియోగిస్తున్నారు. ఆందోళనల సమయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వ్యక్తులతోపాటు ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం, అల్లరిమూకల ఆట కట్టించడంలో సత్ఫలితాలు వస్తున్నాయి. అలాగే జిల్లాలో జరిగే మంత్రులు, సీఎం సమావేశాలతోపాటు జాతర్లలో కూడా వినియోగిస్తూ నేరాలను అదుపు చేయడంలో డ్రోన్లు కీలకంగా పనిచేస్తున్నాయి.

తక్కువ సిబ్బంది సరిపోతారు

పది మంది పోలీసు సిబ్బంది పనిచేయాల్సిన చోట ఒక డ్రోన్ పనిచేయగలుగుతుంది. పోలీసులకు సమయంతో పాటు తక్కువ సిబ్బంది సరిపోతారు. ఉదాహరణకు 100 మంది వాకింగ్‌చేసే ప్రాంతంలో ఒక్క కానిస్టేబుల్ డ్రోన్ ఎగరేసి ఆ పరిసరాలను పర్యవేక్షించగలుగుతారు. చిత్తూరులో ఇప్పటికే ప్రజలు వాకింగ్ చేసే ప్రాంతాలైన పీవీకేఎన్ డిగ్రీ కళాశాల, కట్టమంచి చెరువు వాకింగ్‌ట్రాక్, కన్నన్ కళాశాల, మెసానికల్ మైదానం వంటి ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో డ్రోన్లను ఎగరేస్తున్నారు.



తేనబండ శివారు ప్రాంతంలో డ్రోన్ షాట్

రక్తతర్పణం





పీర్లను ఊరేగిస్తున్న షియా ముస్లింలు



తూగుండ్రం హైస్కూల్ మలుపువద్ద రక్తం చిందిస్తున్న యువకులు, పెద్దలు, చిన్నారులు

రక్తం చిందించి ఇమామ్ హుస్సేన్‌కు నివాళి అర్పించిన షియా ముస్లింలు

ఆవలకొండ నుంచి తూగుండ్రం ఫకీర్‌తోట వరకు పీర్ల ఊరేగింపు

గంగాధరనెల్లూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఇమామ్‌హుస్సేన్‌కు నివాళిగా ఆవలకొండ గ్రామంలోని షియా ముస్లింలు ఆదివారం రక్తతర్పణం (అజాదారిమాతం) చేశారు. మొహర్రం సందర్భంగా షియా ముస్లింలు ఆహారం తీసుకోకుండా ఇమామ్ హుస్సేన్ కోసం శోకతప్తంతో ప్రార్థనలు చేయడం, పురుషులు తమ శరీరంలోని రక్తాన్ని చిందించి.. నివాళి అర్పించడం ప్రతి ఏడాది ఆనవాయితీగా వస్తోంది. గంగాధరనెల్లూరు మండలం తూగుండ్రం పంచాయతీ ఆవలకొండలో మొహర్రం సందర్భంగా పదో రోజైన ఆదివారం అంజుమన్ అబ్బాషియా కమిటీ ఆధ్వర్యంలో అజాదారి మాతమ్ కార్యక్రమం నిర్వహించారు. షహజతే గాజీ అబ్బాస్ జ్ఞాపకార్థం శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు షియా ముస్లింలలో చిన్నారులు, యువకులు, మహిళలు, పెద్దలు పలువురు నల్ల దుస్తులు ధరించి అబ్బాషియా అసుఖానాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆవలకొండ, తూగుండ్రం హైస్కూల్ మలుపు, తూగుండ్రం ఫకీర్‌తోట వరకు పీర్లను ఊరేగించారు. అక్కడ పలువురు చిన్నారులు, యువకులు, పెద్దలు పదునైన చాకులు, బేడ్లతో తమ శరీరంపై, ఛాతీపై, వీపుపై కొట్టుకుంటూ రక్తతర్పణం చేశారు. వీరి రక్తంతో తారురోడ్డు సైతం ఎరుపెక్కింది. ఫకీర్‌తోటవద్ద ఉన్న అగ్నిగుండం చుట్టూ షియా ముస్లింలు పీర్లతో ఊరేగింపుగా తిరిగి.. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సీఐ శ్రీనివాసంతి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. పీర్ల ఊరేగింపులో ఆవలకొండ, బాలగంగనపల్లె, గంగాధరనెల్లూరు అబ్బాస్ కాలనీ, చౌటూరు, వీరకనెల్లూరు, పాలసముద్రం మండలంలోని కనికాపురం, వెంగళ్రాజుకుప్పం, రాచపాళ్యం, చిత్తూరు నగరానికి చెందినవారితోపాటు తమిళనాడు,కర్ణాటక రాష్ట్రాల్లోని షి యా ముస్లింలు, అంజుమన్ అబ్బాసియా కమిటీ చైర్మన్, తూగుండ్రం మాజీ సర్పంచ్ ఎస్.హెచ్.నియాజ్ అలీ, మతగురువులు మౌలానా అబీద్‌అలీ, మౌలానా కుమేల్ అబ్బాస్, కమిటీ వైస్ చైర్మన్ యగ్బాల్ హుస్సేన్, కార్యదర్శి రహమత్‌అలీ, కోశాధికారి షాకీర్‌అలీ, జాయింట్ కోశాధికారి మెహిది అలీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను హిందూ కుటుంబాలవారు కూడా వీక్షించారు.



ఫకీర్‌తోట వద్ద అగ్నిగుండం చుట్టూ పీర్ల ఊరేగింపు

చనిపోయిన ఏనుగు కోసం వచ్చి

గజరాజుల గుంపు బీభత్సం

- కళేబరాన్ని పూడ్చిపెట్టిన గుంతను తవ్వేందుకు యత్నం
- ఆగ్రహంతో సమీపంలోని పంటలపై దాడి



ఏనుగు కళేబరాన్ని పూడ్చిపెట్టిన స్థలంలో గజరాజుల పాదముద్రలు

కల్లూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలోని పాతపేట పంచాయతీ చిట్టారెడ్డిపేట సమీపంలోని పెద్దబుట్ట చెరువు కట్టకింద 17 ఏనుగుల గుంపులోని ఒక ఏనుగు శుక్రవారం రాత్రి మృతి చెందిన విషయం తెలిసిందే. అప్పటికి వెళ్లిపోయిన మిగతా ఏనుగుల్లో కొన్ని శనివారం రాత్రి అదే ప్రాంతానికి తిరిగొచ్చాయి. నాలుగు గజరాజులు మాత్రం చనిపోయిన ఏనుగు జాడ కోసం గాలించాయి. అప్పటికే ఏనుగు కళేబరాన్ని అటవీశాఖాధికారులు ఖననం చేసి ఉండటంతో ఆ ప్రాంతాన్ని గుర్తించాయి. కళేబరాన్ని పూడ్చిపెట్టిన గుంతను తవ్వడానికి ప్రయత్నించాయి. కుదరకపోవడంతో ఆగ్రహించాయి. సమీపంలోని గుర్రప్ప, వరిపంటను తొక్కేశాయి. బోడెరెడ్డిగారిపల్లెలోని పలువురి టమోటా పంటను ధ్వంసం చేసి ఆడవిలోకి చేరుకున్నాయి. మిగిలిన ఏనుగులు కల్లూరు సమీపంలోని రఫి, సాదిక్, మహబూబ్‌జాన్, భాదర్‌బాషా, అమ్ములాకు చెందిన మామిడిచెట్లను, రాతికూసాలను విరిచేశాయి. కల్లూరు మూలోర్పేట సమీపంలో మామిడితోటలో ఉన్న ఓ ఇంటిని ఏనుగుల గుంపు చుట్టుముట్టాయి. ఆ ఇంట్లోని వ్యక్తి భయాందోళనకు గురయ్యాడు. గమనించిన అటవీశాఖ సిబ్బంది.. టపాకాయలు పేల్చడంతో ఏనుగుల గుంపు అడవిలోకి వెళ్లిపోయాయి.



వరిపంటను ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఏనుగు చనిపోయిన ప్రాంతానికి ఏనుగుల గుంపు మళ్లీ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్‌బీవో శ్రీదేవి హెచ్చరించారు. ఈ ప్రాంతంలో రాత్రిపూట ప్రజలు బయటకు రావొద్దని, తెల్లటి దుస్తులు ధరించి తిరగొద్దని సూచించారు.

నగియాలలో ఒంటరి ఏనుగు హల్‌చల్

- భయాందోళనలో స్థానికులు

- 7వ పేజీలో -

నేడు 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి విజ్ఞప్తులను తీసుకుంటారని పేర్కొన్నారు. జిల్లా అధికారులందరూ విధిగా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. డివిజన్, మండల స్థాయిల్లోనూ అధికారులు పాల్గొని పీజీఆర్ఎస్ నిర్వహించాలని సూచించారు. ● జిల్లా పోలీసు కార్యాలయంలోనూ సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ జరుగుతుందని ఎస్పీ మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. బాధిత ప్రజలు హాజరై తమ సమస్యలను తెలియజేయవచ్చన్నారు.

భక్తులతో బోయకొండ కిటకిట

- గంగమ్మను దర్శించుకున్న 20వేల మంది
- సేవా టికెట్లతో రూ.10 లక్షల ఆదాయం



చౌడేపల్లె, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం గంగమ్మ భక్తులతో కిక్కిరిసింది. ఉదయం తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సుమారు 20వేల మంది భక్తులు దర్శించుకోగా, వివిధ సేవా టిక్కెట్లతో ఒక్కరోజులో అమ్మవారికి రూ.10లక్షల ఆదాయం సమకూరింది. ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.

ఏబీసీ జ్యూస్ ఫ్యాక్టరీలో నకిలీ టోకెన్లపై సీరియస్

- కీలక సూత్రధారి అయిన హార్టికల్చర్ అసిస్టెంట్ చిత్తూరు సబ్‌జైలుకు తరలింపు
- ఉద్యోగం నుంచి తొలగించే అవకాశం

వెదురుకుప్పం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఏబీసీ జ్యూస్ ఫ్యాక్టరీలో నకిలీ టోకెన్ల వ్యవహారం సీరియస్‌గా మారింది. కీలక సూత్రధారిగా ఉన్న కార్వేటినగరం మండలం డీఎంపురం గ్రామ సచివాలయంలో పనిచేసే హార్టికల్చర్ అసిస్టెంట్ వెంకటేష్‌ను పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం జడ్జి ఎదుట హాజరుపరిచి, చిత్తూరు సబ్‌జైలుకు తరలించారు. నకిలీ టోకెన్ల విషయం వెలుగు చూడటంతో ఫ్యాక్టరీ మేనేజర్ వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదుతో ఈనెల 4న తేదీన కార్వేటినగరం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ హనుమంతప్ప నేతృత్వంలో జరిగిన విచారణలో రైతులకు నకిలీ టోకెన్లను ఇచ్చింది వెంకటేష్ అని నిర్ధారణకు వచ్చి అరెస్టు చేశారు. ఇతడిని సస్పెండ్ చేయడమే కాకుండా.. ఉద్యోగం నుంచి తొలగించే అవకాశం కూడా ఉందని పోలీసులు అంటున్నారు. ఈ విషయమై కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఉద్యానశాఖ డీడీ సమగ్ర నివేదిక అందించారు.

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి

- జిల్లా జడ్జి అరుణ సారిక



పూతలపట్టు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని జిల్లా జడ్జి అరుణ సారిక సూచించారు. జిల్లా కోర్టు ఆవరణలో ఆదివారం ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని న్యాయమూర్తులతో సమీక్షించారు. పెండింగ్ కేసుల కారణంగా కక్షిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని న్యాయమూర్తులు కేసుల పరిష్కారానికి తమవంతు కృషి చేయాలన్నారు. పెండింగ్ కేసుల్లో త్వరగా హైకోర్టు పర్యవేక్షిస్తోందని చెప్పారు. జూనియర్ డివిజన్ సివిల్ న్యాయమూర్తులు.. క్రిమినల్ కేసులను పరిష్కరించే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా వృద్ధులకు సంబంధించిన కేసుల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. కేసుల పరిష్కారానికి కొన్ని సలహాలు, సూచనలిచ్చారు.

తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించిన కేసులో సర్పంచ్ అరెస్టు

యాదమరి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తప్పుడు ధ్రువీకరణ పత్రాలను సృష్టించిన కేసులో ఓ సర్పంచ్‌ని అరెస్టు చేశారు. ఎస్ఐ ఈశ్వర్ తెలిపిన వివరాల మేరకు.. యాదమరి మండలంలోని 184 గొల్లపల్లె వైసీపీ మద్దతుదారు సర్పంచ్ వరదామయ్య గౌడ్.. తప్పుడు ధ్రువీకరణ పత్రాలను సృష్టించి, పాస్‌పుస్తకాలు తీసుకుని వాటిని బ్యాంకులో పెట్టి లోను తీసుకున్నారు. ఆయన తల్లి లక్ష్మి ఫిర్యాదుతో గత ఏడాది జూలై నెలలో కేసు నమోదైంది. వారసత్వంగా వచ్చే ఆస్తుల్లో అన్నదమ్ములకు చట్టప్రకారం భాగం పరిష్కారం చేయకుండా తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో తన పేరుపైనా, భార్య పేరుపైనా పాస్‌బుక్‌లు తీసుకున్నట్టు దర్యాప్తులో పోలీసులు గుర్తించారు. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

తిరుమలేశుడి సర్వదర్శనానికి 13 గంటలు

తిరుమల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి 13 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శుక్రవారం హుండీ ఆదాయం: రూ.3.33 కోట్లు
శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 87,536
తలనీలాలు సమర్పించినవారు: 35,120

నేటినుంచి పశుగ్రాస వారోత్సవాలు

చిత్తూరు సెంట్రల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం నుంచి వారం రోజుల పాటు పశుగ్రాస వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ జేడీ ఆబ్బుల్ ఆరిఫ్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. పశువులు పచ్చిమేతను మేసినప్పుడే, రైతుల పోషణ వ్యయం తగ్గి, పాడి పరిశ్రమ గిట్టుబాటు అవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పశుగ్రాస వారోత్సవాల్లో పాడి రైతులకు మేలురకం పశుగ్రాస విత్తనాల కిట్లు రాయితీపై ఇవ్వనున్నట్లు తెలిపారు. జొన్న, ఆఫ్రికన్ టాల్ మొక్కజొన్న రకం, అలసందలు, సజ్జలు, మొక్కజొన్నలు వంటి విత్తనాలు మినీ కిట్ రూపంలో 75 శాతం రాయితీపై అన్ని పశువైద్య కేంద్రాలు, రైతు సేవా కేంద్రాల్లో ఇవ్వనున్నట్లు చెప్పారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మామిడి రైతులకు తప్పని తిప్పలు



ఏబీసీ జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద గుమికూడిన రైతులు

వెదురుకుప్పం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం అన్నూరు వద్ద ఉన్న ఏబీసీ జ్యూస్ ఫ్యాక్టరీలో మామిడి రైతులకు తిప్పలు తప్పడం లేదు. టోకెన్‌పై మామిడి కాయల లోడును తీసుకెళ్లినా మూడు నుంచి ఐదు రోజుల వరకు అన్‌లోడింగ్ కావడం లేదని రైతులు తెలిపారు. కాయలను అన్‌లోడింగ్ చేయడానికి ఉండాల్సిన శ్రామికుల కన్నా తక్కువగా ఉండటమే జాప్యానికి కారణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జిల్లా యంత్రాంగం దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

రేబిస్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



శునకాలకు వ్యాక్సిన్ వేస్తున్న పశుసంవర్ధక శాఖ జేడీ అబ్దుల్ ఆరీఫ్

చిత్తూరు సెంట్రల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జంతువుల నుంచి మనుష్యులకు సోకే రేబిస్ వ్యాధిపట్ల ప్రజలు, జంతు ప్రేమికులు, శునకాల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ జేడీ అబ్దుల్ ఆరీఫ్ అన్నారు. జూనోసిస్ డేని పురస్కరించుకుని ఆదివారం స్థానిక పశువైద్యశాలలో శునకాలకు ఉచిత టీకాల కార్యక్రమం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. జంతువులు, పక్షుల నుంచి మనుష్యులకు 280 రకాల వ్యాధులు వ్యాపించే వీలుందని, వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. జూనోసిస్ డే సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పశువైద్యశాలల్లో 23,440 ఉచిత డోసుల టీకాలు శునకాలకు వేయనున్నట్లు తెలిపారు. ఆదివారం 2942 డోసుల టీకాలు వేశామని చెప్పారు. ఉచిత టీకాల ప్రక్రియ డోసులు ఉన్నంతవరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో లోకేష్, పశువైద్యాధికారి సుబ్బమ్మ పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ సెక్రటరీ

ఐరాల(కాణిపాకం), జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల కమిషన్ సెక్రటరీ జీవీ సాయిప్రసాద్ ఆదివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆయన్ను అధికారులు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదమంత్రాలతో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు.



జీవీ సాయిప్రసాద్‌ను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

కాలినడకన తిరుమలకు గోవు



తిరుమల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల గోవిందుడి సేవకు భక్తులతో కలసి ఓ గోవు కూడా కాలినడకన తిరుమల కొండెక్కడం అందరినీ ఆశ్చర్యపరిచింది. సాధారణంగా అలిపిరి మెట్ల మార్గంలో కాలినడకన వచ్చేందుకు భక్తులు ఆపసోపాలు పడుతుంటారు. ఓ గోవు మాత్రం ఎలాంటి అలసటకు గురికాకుండా ఆదివారం ఉదయం భక్తులందరితో కలిసి కాలినడకన తిరుమల చేరుకుంది. కోట్లాది దైవాలకు స్వరూపంగా ఆరాధించే గోవు గోవిందుడి సన్నిధికి ఇలా కాలినడకన రావడాన్ని చూసిన పలువురు భక్తులు తమ వద్దనున్న పండ్లు పెట్టడంతో పాటు నీరు తాగించి సంతోషం వ్యక్తం చేశారు.

ఎర్రజెండాకు వందేళ్లు



తిరుపతి(ఆటోనగర్), జూలై 6 (ఆంధ్రజ్యోతి): భారతగడ్డపై 'ఎర్రజెండా'కు వందేళ్లయిన సందర్భంగా ఆదివారం తిరుపతిలో సీపీఐ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. పార్టీ పటిష్టతకు గ్రామ, డివిజన్, మండల, జిల్లా స్థాయిలో సభలు, సమావేశాలు నిర్వహించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. ప్రతి చోట వంద చెట్లు, వంద జెండాలు నాటాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా కొన్ని మొక్కలు నాటారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు.

ననియాలలో ఒంటరి ఏనుగు హల్‌చల్

● భయాందోళనలో స్థానికులు

రామకుప్పం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం ననియాల సమీప పొలాలు, తోటలపై ఒంటరి ఏనుగు బీభత్సం సృష్టించింది. 15 రోజులుగా దాడులు చేస్తూనే ఉంది. అటవీ అధికారులు, ట్రాకర్లు ప్రతి రాత్రీ ఏనుగును అడవిలోకి మళ్లించే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. అది మాత్రం పొలాలు, తోటల్లో విధ్వంసం సృష్టించి తెల్లవారు జామున అడవిలోకి వెళుతోంది. శనివారం రాత్రి మురుగేష్, బెంగళూరుప్ప తదితర రైతులకు చెందిన మామిడి, టమోటాతోటలపై దాడులు చేసింది. మామిడి పండ్లను తిన్నంతగా తిని కొమ్మలు విరిచేసింది. కొబ్బరిచెట్లను, బొప్పాయి చెట్లను కూడా ధ్వంసం చేసింది. తెల్లవారు జామున నని యాల-89పెద్దూరు రహదారిలో హల్‌చల్ చేస్తూ స్థానికులను భయాందోళనకు గురిచేసింది. ఆ తర్వాత అడవిలోకి వెళ్లిపోయింది. గిట్టుబాటు ధర లేకపోవడంతో ననియాల గ్రామ పరిసరాల్లోని మామిడి తోటల్లో కాయల్ని కోయకుండా రైతులు వదిలేశారు. అవి పండిపోయి వాసన వస్తుండటంతో ఒంటరి ఏనుగు వీటిపై పడుతున్నట్లు అటవీ అధికారులు తెలిపారు. ట్రాకర్లతో కలిసి తాము దాన్ని అడవిలోకి మళ్లించడానికి ప్రయత్నిస్తుంటే తిరగబడుతోందని చెప్పారు. మదపుటేనుగు కాదని, అయినప్పటికీ రైతులు దానిని రెచ్చగొట్టే ప్రయత్నం చేయొద్దని హెచ్చరించారు. గ్రామ పరిసరాల్లోకి ఏనుగు వస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. అదేవిధంగా ననియాల-89పెద్దూరు రహదారిలో చీకటి పడ్డాక ఎవరూ ప్రయాణాలు సాగించవద్దని సూచించారు.



పొలాల వైపు వెళ్తున్న ఏనుగు, ఏనుగు ధ్వంసం చేసిన కొబ్బరి, మామిడి చెట్లు, అడవి నుంచి ఏనుగు బయటకు రాకుండా చూడటానికి వేచి ఉన్న అటవీ అధికారులు, ట్రాకర్లు

వచ్చేనెల 27నుంచి వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలు

ఐరాల(కాణిపాకం), జూలై 6 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆగస్టు 27వ తేదీన వినాయక చవితితో ప్రారంభమవుతాయని ఈవో పెంచలకిషోర్ ఆదివారం మీడియాకు తెలిపారు. 28న ధ్వజారోహణం, హంస వాహన సేవ, 29న స్వర్ణ నెమలి వాహనం, 30న మూషిక వాహన సేవ, 31న స్వర్ణ చిన్న, పెద్ద శేషవాహన సేవ, సెప్టెంబరు 1న ఉదయం చిలుక వాహనం, రాత్రి వృషభ వాహన సేవ, 2న గజ వాహన సేవ, 3న రథోత్సవం, 4న తిరుకల్యాణం, అశ్వవాహన సేవ, 5న ధ్వజావరోహణం, ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. అనంతరం ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా సెప్టెంబరు 6న అధికారనంది వాహన సేవ, 7న రావణబ్రహ్మ వాహన సేవను చంద్ర గ్రహణం కారణంగా ఉదయం నిర్వహిస్తారు. 8న యాళి వాహన సేవ, 9న సూర్యప్రభ వాహన సేవ, 10న చంద్రప్రభ వాహన సేవ, 11న కల్పవృక్ష వాహన సేవ, 12న విమానోత్సవం, 13న పుష్పపల్లకి సేవ, 14న కామధేను వాహన సేవ, 15న పూలంగి సేవ, 16న తెప్పోత్సవంతో ప్రత్యేక ఉత్సవాలు ముగుస్తాయని ఈవో వివరించారు.

ఉభయదారుల సహకారంతో బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం: ఈవో

కాణిపాక వరసిద్ధుడికి 21 రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలను ఆలయ ఉభయదారుల సహకారంతో వైభవంగా నిర్వహిస్తామని ఈవో పెంచలకిషోర్ తెలిపారు. మణికంఠేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వరసిద్ధుడి ఆలయానికి చెందిన 14 గ్రామాల ఉభయదారులతో ఈవో ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. తొలుత ఆలయ ప్రధాన అర్చకుడు సోమశేఖర్‌గురుకుల్ బ్రహ్మోత్సవ పత్రికను చదివి వినిపించారు. అనంతరం ఉభయదారులు మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధి కోసం భూములు కోల్పోయిన రైతులకు ఆలయంలో ఉద్యోగాలు కల్పించాలన్నారు. స్థానికులు స్వామి దర్శనానికి విచ్చేసే వీఐపీ గేటు వద్ద స్థానిక ఉద్యోగులను నియమిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ప్రధాన ఆలయంలోని ఉపాలయమైన వీరాంజనేయ స్వామి ఆలయానికి క్యూలైన్ ఇబ్బంది లేకుండా అధికారులు చూడాలని కోరారు. మరగదాంబిక ఆలయంలో అమ్మవారి వద్ద ఓ అర్చకుడిని ఏర్పాటు చేయాలని సూచించారు. అంతరాలయ దర్శనంలో కొందరు భక్తులు ప్యాంటుపై పంచె కట్టుకుని వచ్చేస్తున్నారని, అనుమతించకుండా చూడాలన్నారు. ప్రధాన ఆలయంలో వేకువ జామున నాలుగు నుంచి ఉదయం ఏడు గంటల వరకు వీఐపీ గేటు తెరిచేలా చర్యలు తీసుకుంటే బావుంటుందన్నారు. శ్రీశైల సత్రానికి ఆలయం భూమిని కేటాయించిన విధంగా ఆలయ ఉభయదారులకూ ఇవ్వాలని కోరారు. చంద్రప్రభ వాహన ఉభయదారులైన దళితులను ఎస్సీలు అని బ్రహ్మోత్సవ పత్రికలో ముద్రించాలని విన్నవించారు. అలాగే తమకు ప్రత్యేక దళిత సత్రాన్ని కేటాయించాలన్నారు. అశ్వవాహన నిర్వహణ రోజు అన్నదానం నిర్వహించడానికి తమకు సత్రాన్ని కేటాయించాలని ఆ ఉభయదారులు కోరారు. అన్ని విషయాలను పరిశీలించి పరిష్కరిస్తామని ఈవో హామీ ఇచ్చారు. సోమశేఖర్‌గురుకుల్ మాట్లాడుతూ.. మరగదాంబిక సమేత మణికంఠేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం, శ్రావణ మాసంలో మహా కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉభయదారుల సంఘ అధ్యక్షుడు ఈశ్వర్‌బాబు, ఈఈ వెంకటనారాయణ, ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, ధనపాల్, ప్రసాద్, ధనంజయ, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, అర్చకులు, వేదపండితులు, 14 గ్రామాల ఉభయదారులు, ఆలయ మాజీ చైర్మన్లు మణినాయుడు, మోహన్ నాయుడు, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



ఉభయదారుల సమావేశంలో బ్రహ్మోత్సవ పత్రికను చదువుతున్న ఈవో పెంచలకిషోర్

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం



ద్రౌపది అమ్మవారికి మొక్కుకుని.. అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

వెదురుకుప్పం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా ద్రౌపది అమ్మవారి ఆలయ ఆవరణంలో భక్తులు ఆదివారం రాత్రి భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఉత్సవాల ముగింపులో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులతో ఆలయ ఆవరణం నిండిపోయింది. కార్వేటినగరంలోనూ జనసందడి కనిపించింది.

పమేరియన్.. బీగిల్.. చౌచౌ





తిరుపతిరూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కాకార్‌స్పానియల్, బీగిల్, చౌచౌ, సైంట్ బెర్నర్డ్, లాసా తిప్సో, రోటవీలర్, షిజు, డాల్‌మిషన్, జర్మన్‌షెపర్డ్, లాబ్రడార్ రిట్రైవర్, గోల్డెన్ రిట్రైవర్, బాక్సర్, ఫగ్, పమేరియన్, డాబర్‌మెన్.. ఇలా, అరుదైన శునకాలతో ఆదివారం తిరుపతిలోని పశువైద్యశాల ప్రాంగణాలు సందడిగా మారాయి. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా వీటికి జిల్లాలో రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. తిరుపతిలో 602 శునకాలు, నాలుగు పిల్లులకు టీకాలు వేశారు.

తెలుగు భాషను కాపాడుకుందాం



సన్మానం అందుకున్న ప్రముఖ రచయితలు

ప్రముఖ శతావధాని ఆముదాల మురళి

గంగవరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష, సంస్కృతుల రక్షణకు ఉద్యమంలా ముందుకు సాగినప్పుడే భాషను కాపాడుకోగలుగుతామని ప్రముఖ శతావధాని కళారత్న ఆముదాల మురళి పేర్కొన్నారు. ఆదివారం తెలుగు సాహిత్య, సాంస్కృతిక సమితి కళామందిరం మూడో వార్షికోత్సవం గంగవరంలో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. తెలుగు భాషా రక్షణకు తులసీనాధం నాయుడు, పుష్ప దంపతులు చేస్తున్న కృషిని అభినందించారు. బెంగళూరుకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్త రమేష్, కడప జానమద్ది సాహితీపీఠం నిర్వాహకుడు విజయభాస్కర్ మాట్లాడుతూ.. కళామందిరంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలు గుర్తుకొచ్చేలా పుస్తకాలను ఏర్పాటు చేయాలని సూచించారు. సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాధం నాయుడు మాట్లాడుతూ.. విద్యార్థులు పద్యాలు చదవడం అలవాటు చేసుకుంటే భాషా నైపుణ్యం పెరగడంతోపాటు మంచి విలువలు నేర్చుకుంటారన్నారు. అనంతరం వందకుపైగా తెలుగు పద్యాలను చెప్పిన 50 మంది విద్యార్థులతోపాటు వివిధ జిల్లాలనుంచి వచ్చిన డాక్టర్ చింతకుంట శివారెడ్డి (కడప), అంకమనాయుడు, నాగార్జున, దామోదరం, మాధవి, నడ్డినారాయణ (తిరుపతి), ప్రకాష్‌రెడ్డి (బెంగళూరు), సాంబయ్య, విజయలక్ష్మి, రమ్య (పలమనేరు), హేమాద్రి, సుధాకర్ (ఆస్.ఆర్.పురం), శాంతాభాస్కర్ (చిత్తూరు), ఆళ్ల నాగేశ్వరరావు (తెనాలి) తదితరులకు వార్షికోత్సవ పురస్కారాలను అందించారు. డాక్టర్ మౌని రచించిన భిన్నధ్రువాలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ధనంజయ, డాక్టర్ మాధవి, పైనేని మురళి, ప్రసాద్, దిలీప్, రమ్య, భారతి, జమున, నరసింహులు, పలమనేరు బాలాజి, విజేంద్రనాయుడు, వేదవతి, దామోదర్‌నాయుడు, శ్రీరామచంద్రమూర్తి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

సత్యవేడు టీడీపీకి కొత్త సారథి

● కో ఆర్డినేటర్‌గా శంకర్‌రెడ్డిని నేడు శ్రేణులకు పరిచయం చేయనున్న మంత్రి అనగాని

● పార్టీతో ఆదిమూలం అనుబంధం ముగిసినట్టేనా? ● సత్యవేడు రాజకీయాల్లో కొత్త అధ్యాయం మొదలు

తిరుపతి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు టీడీపీ తెర మీదకు హఠాత్తుగా కొత్త పేరు ప్రత్యక్షం కావడం రాజకీయ చర్చకు దారితీసింది. తాజా పరిణామాలు, నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్తగా కేఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత కూరపాటి శంకర్‌రెడ్డిని నియమిస్తున్నట్టు పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. టీడీపీ నుంచి ఎమ్మెల్యే ఆదిమూలంను సస్పెండ్ చేసిన తర్వాత కో ఆర్డినేటర్‌గా శ్రీపతి బాబు, ఎన్నికల నాటి పరిశీలకుడు చంద్రశేఖర్ నాయుడు నియోజకవర్గంలో పార్టీ వ్యవహారాల్లో క్రియాశీలంగా ఉన్నారు. తనపై ఫిర్యాదునే ఉపసంహరించుకున్నందున సస్పెన్షన్‌ను ఎత్తేయాలని ఆదిమూలం కోరినప్పటికీ పార్టీ అధినేత సానుకూలంగా స్పందించలేదు. ఈ దశలోనే పార్టీ కో ఆర్డినేటర్‌గా శంకర్‌రెడ్డిని ప్రకటించారు. ఈ పరిణామం.. ఆదిమూలం పట్ల టీడీపీ వైఖరిని మరింత స్పష్టం చేసినట్లే అని భావిస్తున్నారు.



విమానాశ్రయంలో ఆదివారం మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం

ఇక కో ఆర్డినేటర్‌గా శంకర్‌రెడ్డిని పార్టీ శ్రేణులకు పరిచయం చేసి, అధినేత ఆదేశాలను వివరించేందుకు సోమవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ సత్యవేడు పర్యటన పెట్టుకున్నారు. ఆదివారం తిరుపతి చేరుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన అనంతరం మధ్యాహ్నానికి సత్యవేడు చేరుకోనున్నారు. అక్కడ తొలుత బేరిశెట్టి కల్యాణ మండపంలో పార్టీ శ్రేణులతో సమావేశం కానున్నారు. ఆ సందర్భంగా శ్రేణులకు కో ఆర్డినేటర్ శంకర్‌రెడ్డిని పరిచయం చేయనున్నారు. ఆపై తొలి అడుగు కార్యక్రమంలో కో ఆర్డినేటర్‌తో పాటు పాల్గొననున్నారు. రాత్రికి సత్యవేడులోనే బస చేసేలా ఆయన పర్యటన షెడ్యూలు ఖరారైంది. దాన్ని బట్టి చూస్తే అటు పార్టీ వర్గాలతో పాటు ఇటు అధికార వర్గాలకు కూడా కో ఆర్డినేటర్‌ను పరిచయం చేసే పరిస్థితి కనిపిస్తోంది. ఇది నియోజకవర్గంలో పార్టీ బాధ్యులు ఎవరనే స్పష్టతనివ్వడానికే అని భావిస్తున్నారు.

ఏడాదిలోనే మార్పులు

సత్యవేడు నియోజకవర్గ రాజకీయాలు ప్రతి ఐదేళ్లకూ మార్పునకు లోనుకావడం ఆనవాయితీగా వస్తోంది. ఈ పర్యాయం మాత్రం ఎన్నికలు జరిగిన ఏడాదికే రాజకీయ నాయకత్వం తారుమారు కావడం గమనార్హం. ఏడాది కిందట వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న కోనేటి ఆదిమూలం అనూహ్య పరిణామాల నడుమ ఆ పార్టీకి గుడ్‌బై చెప్పాల్సి వచ్చింది. టీడీపీలో చేరి టికెట్ తెచ్చుకుని ఎన్నికల్లో గెలిచారు. అధికార పార్టీ ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో కుదురుకునేలోపే భారీ కుదుపునకు లోనయ్యారు. పార్టీ నుంచీ సస్పెన్షన్‌కు గురై రాజకీయ జీవితంలో సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఆయన సస్పెన్షన్ తర్వాత తొమ్మిది నెలల గడువు దొరికినా ఇతర ఆశావహులు ఆ శూన్యతను సద్వినియోగం చేసుకోలేదు. మాజీ ఎమ్మెల్యే హేమలత గానీ, ఆమె కుమార్తె గానీ, కోఆర్డినేటర్ శ్రీపతి గానీ, పరిశీలకుడు చంద్రశేఖర్ నాయుడు గానీ పరిస్థితులను అనుకూలంగా మలచుకునే ప్రయత్నం చేయలేదని అంటున్నారు. ఆ వ్యవధిలో అధిష్ఠానం అనేక కోణాల్లో కసరత్తు చేసి కేఎస్‌ఆర్ నిర్మాణ సంస్థ అధినేత కూరపాటి శంకర్‌రెడ్డిని సమన్వయకర్తగా తెర ముందుకు తెచ్చిందని అంటున్నారు. విశేషం ఏమిటంటే.. పార్టీలో అన్ని వర్గాలూ ఆయన రాక పట్ల సానుకూలంగానే వున్నాయి. చివరికి సస్పెన్షన్‌లో వున్న ఎమ్మెల్యే ఆదిమూలం, ఆయన కుమారుడు సుమన్ కూడా శంకర్‌రెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. కలసికట్టుగా సత్యవేడును అభివృద్ధి చేస్తామంటూ ప్రకటనలు కూడా ఇచ్చారు. ఈ పరిణామాలు సత్యవేడులో టీడీపీ పటిష్టపడడానికి ఎంతమేరకు దారితీస్తాయో చూడాలి.

ఆర్టీసీ ఉద్యోగ, కార్మికుల సమస్యలకు పరిష్కారం



డిపో సిబ్బందితో మాట్లాడుతున్న పీఎస్ఎం

కుప్పం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తప్పకుండా కృషి చేస్తుందని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం అన్నారు. రాజమహేంద్రవరంలోని ఆర్టీసీ డిపోను ఆదివారం ఆయన సందర్శించారు. డిపోలో నడుస్తున్న బస్సు సర్వీసులు, ప్రయాణికులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. అక్కడి ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ఈ సందర్భంగా పీఎస్ఎంను కలిసి పలు సమస్యలపై విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ప్రభుత్వాన్ని నడపుతున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను తప్పకుండా తీరుస్తారని హామీ ఇచ్చారు. డిపో అభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో డిపో అధికారులు, సిబ్బంది, కుప్పం ఏఎంసీ మాజీ ఛైర్మన్ సత్యేంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు గ్రాట్యుటీ చెల్లించాలి



నిరసన తెలుపుతున్న సోమచంద్రారెడ్డి తదితరులు

పలమనేరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్లకు వెంటనే గ్రాట్యుటీ చెల్లించాలని పలమనేరు పెన్షనర్ల సంక్షేమ సంఘ అధ్యక్షులు ఎన్. సోమచంద్రారెడ్డి డిమాండు చేశారు. ఆదివారం పలమనేరులో పెన్షనర్ల సర్వీసు సెంటరు వద్ద పెన్షనర్లతో కలిసి ఆయన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం అక్టోబరు తరువాత ఉద్యోగ విరమణ చేసిన వారికి ఇప్పటి వరకు గ్రాట్యుటీ చెల్లించలేదన్నారు. గతంలో ఎన్నడూ గ్రాట్యుటీ చెల్లింపులు నిలిపిన దాఖలాలు లేవన్నారు. కరోనా సమయంలోనూ నిలుపుదల చేయలేదని వాపోయారు. పీఆర్సీ ఆలస్యం కావడంతో రిటైర్డు అవుతున్న ఉద్యోగులు ఆర్థిక ప్రయోజనాలు కోల్పోతున్నారన్నారు. వెంటనే పీఆర్సీ అమలు చేయాలని డిమాండు చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలలో కనీసం రెండు అయినా వెంటనే విడుదల చేయాలన్నారు. ఖజానా కార్యాలయాల్లో పెన్షనర్ల సమస్యలను వివక్ష లేకుండా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పెన్షనర్లు శ్రీనివాసులు, పరశురాం, జగదీష్, ఉమాపతి, నాగభూషణం, రెడ్డిశ్రీనివాసులు, మోహన్, శేఖర్ తులసిరెడ్డి, ఎంటీఎస్ ఉపాధ్యాయులు ఏఆర్‌కుమార్, ప్రతాప్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

75 మందికి నేత్రపరీక్షలు



శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పలమనేరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పలమనేరు రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన కంటి వైద్యశిబిరంలో 75 మందికి నేత్రపరీక్షలు నిర్వహించి 50 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. చెన్నై శంకర నేత్రాలయ వైద్యులు మురళి నేత్రపరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్లు చేసుకునే వారికి చెన్నై శంకర నేత్రాలయలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని, ఉచిత వాహన సౌకర్యం కల్పిస్తామని వైద్యులు మురళీ తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



పెద్దచెరువులోకి వాలిపోయిన విద్యుత్ స్తంభం

పలమనేరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో జాతీయ రహదారి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం వాలిపోయి పక్కనే ఉన్న పెద్దచెరువులోకి పడిపోయేందుకు సిద్ధంగా ఉంది. విద్యుత్ స్తంభం చెరువులో కూలిపోతే పెద్దచెరువు ట్యాంక్ బండ్‌పై ఉన్న విద్యుత్ దీపాలకు సరఫరా నిలిచిపోయే ప్రమాదం ఉంది. మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు స్తంభం కూలిపోక ముందే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నల్లగుట్లపల్లిలో భగవద్గీతపై ప్రచారం



భగవద్గీతలపై ప్రచారం చేస్తున్న ఇందూ జ్ఞానవేదిక సభ్యులు

పలమనేరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు సమీపంలోని నల్లగుట్లపల్లి గ్రామంలో ఆదివారం భగవద్గీతపై ఇందూ జ్ఞానవేదిక సభ్యులు ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచానికి అత్యుత్తమ జ్ఞానం కలిగిన భగవద్గీతను శ్రీకృష్ణుడు అందించారని.. గురుపౌర్ణమి రోజున శ్రీకృష్ణుడిని మాత్రమే పూజించడం సముచితమన్నారు. కార్యక్రమంలో పలమనేరు, బంగారుపాళ్యం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక కమిటీ అధ్యక్షులు భాస్కర్, బాలాజీ, సభ్యులు జ్యోతి, రెడ్డెమ్మ, రేఖ, కళ్యాణి, రాజేంద్ర, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలన ప్రజాహితం : గౌనివారి

రామకుప్పం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రజాహితమే పరమావధిగా సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఆయన రామకుప్పం మండలం చెల్దిగానిపల్లెలో విలేకర్లతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రజలను వేధించడానికి టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన పలు పథకాలను రద్దు చేసిందని ఆయన తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన రివర్స్ టెండరింగ్ విధానంతో దోచుకోవడం తప్ప సాధించిందేమీ లేదని పేర్కొన్నారు. దీంతో ఆ విధానాన్ని చంద్రబాబు ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక పేదలకు పట్టెడన్నం పెడుతున్న అన్నక్యాంటీన్లు, పేద విద్యార్థులకు వరంగా ఉన్న విదేశీ విద్య, చంద్రన్న బీమా, చంద్రన్న పెళ్లికానుక, షాదీముబారక్, సంక్రాంతి కానుక, రంజాన్‌తోఫా, ఉచిత ఇసుక, ఉచిత మంచినీటి సరఫరాతో పాటు మరెన్నో పథకాలను రద్దు చేసి అన్ని వర్గాల ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారన్నారు. వీటన్నింటిని గుర్తు పెటుకున్న జనం ఎన్నికల్లో జగన్‌పార్టీకి బుద్ధి చెప్పి 11 సీట్లకే పరిమితం చేశారని తెలిపారు. రాష్ట్రం నుంచి పేదరికాన్ని తరమాలన్న ధ్యేయంతో పీ-4 విధానంతో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారన్నారు. ఏడాది పాలనలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. దీన్ని జీర్ణించుకోలేకే వైసీపీ నేతలు రాష్ట్ర ప్రభుత్వంపై పసలేని విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

నేడు కడా పీడీ గ్రీవెన్స్ డే

కుప్పం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల సచివాలయంలోని సమావేశపు గదిలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కడా పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సాగే ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి పలు అంశాలపై ఫిర్యాదులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు హాజరయ్యే ఈ సమావేశానికి వచ్చి అర్జీలు ఇచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఘనంగా లక్ష్మరెడ్డి వర్ధంతి



పూజల్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సదుం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సదుం మండలం ఎర్రాతివారిపల్లెలో ఆదివారం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తండ్రి లక్ష్మరెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన సమాధి వద్ద ఘనంగా నివాళులర్పించారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నేడు సదుంలో 'సుపరిపాలనలో తొలి అడుగు'

సదుం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని సదుం మండలం చీకలచేనులో జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్ రెడ్డి ప్రారంభించనున్నట్లు మండల పార్టీ కన్వీనర్ రెడ్డిప్రసాద్ రెడ్డి ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గోశాల నిర్వహణకు రూ.25 వేల విరాళం



గోశాలకు విరాళం ఇస్తున్న దాత గోపాల్

చౌడేపల్లె, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ గోశాల నిర్వహణకు అమ్మవారి భక్తుడు రూ.25 వేలు విరాళం ఇచ్చినట్లు ఆలయ ఈవో ఏకాంబరం పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన అమ్మవారి భక్తుడు గోపాల్ అమ్మవారి గోశాల నిర్వహణకు విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. దాత కుటుంబ సభ్యులు గతంలో అమ్మవారికి విరాళాలు ఇచ్చారని ఈవో తెలిపారు. దాత కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఏకలవ్యుడికి నివాళులు



ఏకలవ్యుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పుంగనూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఏకలవ్య మహరాజ్ జయంతి వేడుకలను పుంగనూరులో దళిత సంఘాల నాయకులతో కలిసి ఎరుకుల సేవాసంఘ అధ్యక్షుడు రామకృష్ణ నిర్వహించారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏకలవ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్, ఎమ్మార్పీఎస్ నియోజక వర్గ కన్వీనర్ నరసింహులు, ఎరుకుల సంఘ నాయకులు శ్రీనివాసులు, దళిత సంఘ నాయకులు శ్రీనివాసులు, నాగరాజ, హరి, శంకర్, వెంకటరమణ, నాగేనాయక్, బాలకృష్ణ, మంజునాథ్, కిరణ్, జేవీ నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల మూలాలపై సమగ్ర విచారణ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అయూబ్‌ఖాన్

పుంగనూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఇస్లామిక్ ఉగ్రవాదుల మూలాలపై సమగ్ర విచారణ చేపట్టాలని బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చా నాయకుడు పి.అయూబ్‌ఖాన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన పుంగనూరులో మాట్లాడుతూ రాయచోటి జిల్లా కేంద్రంలో ఇటీవల ఇస్లామిక్ ఉగ్రవాదులు అబూబకర్, మహ్మద్‌అలీ స్థిరపడి మరింత మందిని ఉగ్రవాదులుగా తయారు చేసి ఉంటారని అనుమానాలు వ్యక్తం చేశారు. పోలీసులు పూర్తి స్థాయిలో పరిశీలించి సంబంధిత వ్యక్తులను అరెస్ట్ చేయాలన్నారు. జిల్లా బీజేపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహులు మాట్లాడుతూ ఉగ్రవాద కార్యకలాపాలకు స్థానికంగా కొందరు సహకరించి ఉంటారని, పూర్తి స్థాయిలో ఉగ్రవాదాన్ని అంతం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు వెంకటప్ప, వెంకటరమణ, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్తల సమావేశం

చౌడేపల్లె, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9న మాజీ సీఎం జగన్ పర్యటన విజయవంతం చేయాలని జడ్పీటీసీ దామోదర్‌రాజు తెలిపారు. ఆదివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధిక సంఖ్యలో కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు నాగభూషణరెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, జంగాలపల్లె వెంకటరమణ, రుక్మిణమ్మ, వరుణ్ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధిలో నవశకం

● మరింత మెరుగైన పాలన అందిస్తాం ● ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



తల్లికి వందనం నగదు పడింది సార్.. అంటూ ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న పిల్లలు



కుప్పం మున్సిపాలిటీలో ప్రచారం చేస్తున్న కన్నన్ తదితరులు

గంగవరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయని.. మరింత మెరుగైన పాలన అందిస్తామని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మామడుగు పంచాయతీ కేంద్రంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీస్తూ చిన్నారులను, వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకెళ్లారు. ప్రతి కుటుంబం నుంచి వారి సమ్యలను తెలుసుకుంటూ కరపత్రాలను అందించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అప్పుల పాలైన రాష్ట్రం నేడు అభివృద్ధి పథంలో నడుస్తోందని.. ప్రజలకు ఏ కష్టం వచ్చినా నేరుగా తన దృష్టికి తీసుకొస్తే అప్పటికప్పుడే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవోలు వేణుగోపాల్, శ్రీనివాసులు, ఎంపీడీవో సురేష్‌కుమార్, టీడీపీ మండలాధ్యక్షులు సోమశేఖర్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి, ప్రసాద్‌నాయుడు, రామ్మోహన్ నాయుడు, సుబ్బారెడ్డి, రామకృష్ణ, మురళీ, వినోద్, ప్రభాకర్, యుగంధర్, హరిబాబు, సోమశేఖర్‌రెడ్డి, జయసింహలతోపాటు పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

● **కుప్పం:** ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రాభివృద్ధిలో నవశకం ప్రారంభమైందని తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి కన్నన్ అన్నారు. పార్టీ పిలుపు ఇచ్చిన ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో భాగంగా ఆయన స్థానిక నాయకులతో కలిసి కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని 11వ క్లస్టర్‌లో ఆదివారం ప్రచారం చేశారు. ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు ముద్రించిన కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లస్టర్ కో ఇన్‌చార్జి తిరుమగళ్, పార్టీ నాయకులు డీకేపల్లె మణి, ఇర్ఫాన్, ప్రకాష్, రవి, సురేష్, స్వామి, చంద్ర పాల్గొన్నారు.

● **కల్లూరు:** సీఎం చంద్రబాబు పాలనలో అన్ని రంగాలు అభివృద్ధి చెందుతున్నాయని టీడీపీ నాయకులు కుమార్‌రెడ్డి, రమేష్, కరుణాకర్‌నాయుడు తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరులో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల కరపత్రాలను ప్రజలకు పంచిపెట్టారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాయకులు అలీంబాషా, ఖాదర్‌వల్లి, అబ్బాస్, సర్దార్, అన్సర్‌భాషా, అభిరాం చౌదరి, రాజేంద్ర పాల్గొన్నారు.

● **చౌడేపల్లె:** అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని టీడీపీ నాయకులు పగడాల హరిప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన స్థానిక టీడీపీ నాయకులతో కలిసి చౌడేపల్లె, చిట్రెడ్డిపల్లెల్లో ఇంటింటికీ పర్యటించి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు కార్తిక్, ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు.

● **పుంగనూరు రూరల్:** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పుంగనూరు టీడీపీ మండలాధ్యక్షుడు మాధవరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని ఆరడిగుంట పంచాయతీ అమ్మిగానిపల్లెలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని చేపట్టారు. టీడీపీ మైనార్టీ నాయకుడు సుహేల్‌బాషా, గంగాధర్, రమణ, రాంబాబు, మధు, అబ్బాస్, దాదు, ఫయాజ్, అబ్దుల్ పాల్గొన్నారు.

శునకాలకు రేబిస్ టీకాలు



శునకాలకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి చందనప్రియ

సోమల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ సంక్రమిత వ్యాధుల దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక పశువైద్యశాలలో ఉచితంగా శునకాలకు యాంటీ రేబిస్ టీకాలను పశువైద్యాధికారి చందనప్రియ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్రమిత వ్యాధులు ముఖ్యంగా రేబిస్, బర్డ్ ఫ్లూ, బ్రూస ఎల్లోసిస్, మెదడువాపు, ఆంత్రాక్స్, క్షయ వ్యాధి ప్రజలకు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందన్నారు. వీటి నివారణకు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని.. పెంపుడు శునకాలకు టీకాలు వేయించాలన్నారు. చనిపోయిన పశువులు, జీవాల మాంసం తినరాదని తెలిపారు.

● **పుంగనూరు రూరల్ :** జంతువుల నుంచి మనుషులకు వ్యాపించే జూనోటిక్ వ్యాధిని నిరోధించడానికే కుక్కలకు టీకాలు వేస్తున్నట్లు పుంగనూరు పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ మనోహర్ తెలిపారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక పశువుల ఆస్పత్రిలో పెంపుడు కుక్కలకు ఉచితంగా టీకాలు వేశారు.

ఐదుగురిపై కేసు నమోదు

రామకుప్పం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): భూవివాదం దాడిపై ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు రామకుప్పం పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. వీర్నమలతాండాకు చెందిన చక్రవర్తినాయక్, మంజుకుమార్ నాయక్‌ల మధ్య భూవివాదం నడుస్తోంది. రెండు నెలల క్రితం వారి కుటుంబాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. అప్పట్లో పోలీసులు చక్రవర్తినాయక్‌పై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. 15 రోజుల క్రితం అతను బెయిల్‌పై విడుదలయ్యారు. భూవివాదంపై ఆదివారం ఇరు కుటుంబాల మధ్య పంచాయతీ నిర్వహించాలని పెద్దమనుషులు నిర్ణయించారు. పెద్దమనుషులు చెప్పిన సమయానికి చక్రవర్తి నాయక్ పంచాయతీకి రాలేదన్న కారణంగా మంజుకుమార్ నాయక్‌తో పాటు మరో నలుగురు కుటుంబసభ్యులు, బంధువులు వారి కుటుంబసభ్యులపై దాడికి పాల్పడ్డాడు. చక్రవర్తి నాయక్ ఫిర్యాదు మేరకు మంజుకుమార్ నాయక్ సహా ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



కుమ్మరగుంటలో ఊరేగుతున్న పీర్లు

పుంగనూరు రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలంలోని వనమలదిన్నె పంచాయతీ కుమ్మరగుంటలో భక్తిశ్రద్ధలతో మొహర్రం నిర్వహించారు. శనివారం రాత్రి గ్రామంలోని హిందూ, ముస్లిం సోదరులు కలిసి పీర్లను ప్రత్యేకంగా అలంకరించి మంగళ వాయిద్యాల మధ్య ఊరేగించారు. గ్రామస్తులు స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే కుమ్మరవీధి, సుబేదార్‌వీధిలో పీర్లను ఊరేగించారు.

ద్విచక్రవాహనం ఢీకొని ఒకరికి గాయాలు

పుంగనూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం మార్లపల్లె సమీపంలోని బోడిబండ వద్ద నడిచి వెళుతున్న వ్యక్తిని ఆదివారం రాత్రి కర్ణాటక నుంచి పుంగనూరుకు వస్తున్న ద్విచక్రవాహనం వేగంగా వచ్చి ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. కర్ణాటకలోని యబ్బినిలో ఇటుకల ఫ్యాక్టరీలో పనిచేసే అమృతసాగర్ ద్విచక్రవాహనంపై వస్తూ ఆరడిగుంట వద్ద ఉన్న శ్రీకాళహస్తి పైపుల పరిశ్రమలో పనిచేసే కార్మికుడు సోము పండిట్ (30) నడచివెళుతుండగా ఢీకొన్నాడు. ప్రమాదంలో సోముపండిట్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గాయపడిన వ్యక్తిని పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం తాగరాదన్నందుకు కత్తితో దాడి

పుంగనూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు పట్టణ సమీపంలోని మేలుపట్ల పొలం వద్ద ముగ్గురు యువకులు మద్యం తాగుతుండగా అక్కడ పనిచేసే వ్యక్తి ఇక్కడ తాగరాదన్నందుకు ఆదివారం కత్తితో దాడి చేసి గాయపరిచారు. మేలుపట్ల వద్ద మధుకర్‌రెడ్డి వ్యవసాయ పొలాన్ని అక్కడే ఉండే వెంకట్రమణ కుమారుడు నారాయణ (53) కాపలాగా ఉంటూ చూసుకునేవాడు. పొలం వద్ద మేలుపట్లకు చెందిన నాని, పవన్, కిశోర్ మద్యం తాగుతుండగా.. పొలంలో తాగరాదని సూచించడంతో నారాయణపై దాడికి పాల్పడ్డారు. మళ్లీ నారాయణ ఇంటి వద్దకు వెళ్లి కత్తితో తలపై నరకడంతో గాయపడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ ఢీకొని భక్తుడికి గాయాలు

చౌడేపల్లె, జూలై 6 (ఆంధ్రజ్యోతి): బోయకొండలో ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఆదివారం గుండ్లబురుజుకు చెందిన భక్తుడు రాజేష్ తీవ్రంగా గాయపడ్డాడు. బండ్లపై రోడ్డులో ద్విచక్రవానంపై వస్తుండగా ప్రమాదం జరిగింది. స్థానికులు, పోలీసులు చికిత్సలు అందించారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఇద్దరికి ...

పుంగనూరు రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు- మదనపల్లె మార్గంలోని భీమగానిపల్లె వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తాపడటంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడగా.. మరో వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ సంఘటన ఆదివారం పుంగనూరు సమీపంలో జరిగింది. అన్నమయ్య జిల్లా రామసముద్రానికి చెందిన శివశంకర్ (54), చలపతి కలిసి ద్విచక్రవాహనంలో మదనపల్లె రోడ్డులోని పెట్రోల్ బంక్ వదకు వెళుతుండగా వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో శివశంకర్ తీవ్రంగా గాయపడగా.. చలపతి స్వల్పంగా గాయపడ్డాడు. గాయపడిన శివశంకర్‌ను మదనపల్లెకు తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

వేణుగోపాలస్వామికి అభిషేకాలు




సోమల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలోని పలు ఆలయాల్లో ఆదివారం తొలి ఏకాదశిని పురస్కరించుకొని ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేపట్టారు. ఈ సందర్భంగా సోమల పంచాయతీలోని చెన్నకేశవస్వామి ఆలయం, కందూరు వేణుగోపాల స్వామి ఆలయాల్లో భక్తులు తరలివచ్చి ఉపవాస దీక్షలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాత్రి భజన మండలి సభ్యులు సంకీర్తనలు ఆలపించారు. చెన్నయ్యగారి పల్లెలో సోమ, మంగళవారం ఆలయంలో కొలుపు ఉత్సవాలు, పోతు రాజు ఆలయంలో బోనాల పండుగ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా తొలి ఏకాదశి



రామకుప్పం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి పర్వదినాన్ని రామకుప్పం మండలంలో ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచే ప్రజలు ఆలయాలకు తరలి వెళ్లి దైవదర్శనాలు చేసుకున్నారు. ఉపవాస దీక్షలు చేశారు. రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆవరణలోని పద్మావతి, వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో ఉదయం ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి విశేష అలంకరణలు చేశారు.

చెల్దిగానిపల్లెలో అఖండ శ్రీరామకోటి నామస్మరణ



రామకుప్పం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం చెల్దిగానిపల్లెలోని కోదండరామస్వామి ఆలయంలో ఆదివారం శ్రీరామకోటి నామస్మరణ కార్యక్రమం ప్రారంభమైంది. బుధవారం ఉదయం 7 గంటలకు శ్రీరామకోటి గురువు రామకోటి రామన్న నేతృత్వంలో కళశ స్థాపన, సీతారాములు, లక్ష్మణ, ఆంజనేయస్వామి చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం శ్రీరామకోటి నామస్మరణ కార్యక్రమం ప్రారంభమైంది. ఆలయంలో మూలమూర్తులకు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు స్వామివారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

ఎల్లమ్మ కొలుపు

సోమల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నడింపల్లె ఎల్లమ్మదేవత కొలుపు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు విరాళాలతో నిర్మించిన కమ్యూనిటీ భవనంలో ఉభయదారులు జీఎల్. మోహన్‌కుమార్, జీఎల్ శ్రీదేవి (జిల్లా జడ్జి) కుటుంబ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

● **చౌడేపల్లె:**



స్థానిక బజారు వీధిలో వెలిసిన రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం స్వామి వారికి ఆలయ అర్చకులు వశిష్టాచార్యులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఏకాదశి సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్థానిక కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో వాసవి వనిత క్లబ్, ఆర్యవైశ్య మహిళలు శ్రీకృష్ణ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భగవద్గీత సామూహిక పారాయణం చేశారు.

19మందికి సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, జూలై 6(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నియోజకవర్గంలోని లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పంపిణీ చేశారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో 19 మంది లబ్ధిదారులకు రూ.13,75,362 చెక్కులను పంపిణీ చేశారు. చిత్తూరు అర్బన్ పరిధిలో 9 మందికి, చిత్తూరు రూరల్ పరిధిలో 7 మందికి, గుడిపాల మండల పరిధిలో ముగ్గురికి సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వివిధ రకాల అనారోగ్య సమస్యలతో చికిత్స పొందిన వారికి సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. బాధితులకు, వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక భరోసాగా ఉంటుందని చెప్పారు. నేతలు కాజూరు బాలాజి, జయచంద్ర నాయుడు, ఈశ్వర్, మోహన్‌రాజ్, సీఎం విజయ, రఘు, విజయేంద్రవర్మ, వరద, మోహన్‌రెడ్డి, కంద పాల్గొన్నారు.

ప్రతి మహిళకు సంక్షేమ పథకాలు అందిస్తాం

● ఎమ్మెల్యే మురళీమోహన్



ప్రజలకు అభివృద్ధి గురించి తెలియజేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ఐరాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఆదివారం నాయకులు, కార్యకర్తలతో కలిసి మండలంలోని చవటపల్లె పంచాయతీ, కొండేపల్లె పంచాయతీ, తిరుమలయ్యగారిపల్లె, పందిగుట్లూరులలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచిందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందన్నారు. నియోజకవర్గ పరిశీలకులు బొమ్మన శ్రీధర్, పోల్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ గిరిధర్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు గంగాధర హరిబాబు, జడ్పీటీసీ లత, మాజీ జడ్పీటీసీ లత, ఆలయ మాజీ చైర్మన్ మణి నాయుడు, టీడీపీ నాయకులు మధుసూదనరావు, మోహన్ నాయుడు, హేమాద్రి నాయుడు, నరసింహులు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తొలి ఏకాదశి పూజలు



శయనోత్సవంలో పాల్గొన్న ఈఓ పెంచలకిషోర్ దంపతులు

ఐరాల(కాణిపాకం), జూలై 6(ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధ ఆలయమైన వరదరాజ స్వామి ఆలయంలో ఆదివారం తొలి ఏకాదశి వేడుకల్లో భాగంగా స్వామికి శయనోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో మూలవిరాట్‌కు పంచామృత అభిషేకం నిర్వహించి, సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో స్వామికి శయనోత్సవాన్ని నిర్వహించగా, దర్శించుకునేందుకు పెద్దసంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. శయనోత్సవ వేడుకల్లో ఆలయ ఈవో పెంచలకిషోర్ దంపతులు, సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి పాల్గొన్నారు. ● చిత్తూరు కల్చరల్ (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ఆలయాల్లో ఆదివారం తొలి ఏకాదశి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలి ఏకాదశి పూజలను స్థానిక కోదండ రామాలయం, పొన్నియమ్మగుడి వీరాంజనేయ స్వామి ఆలయం, రాజగుడి, కట్టమంచి వరదరాజ, గిరింపేట దుర్గాంబ తదితర ఆలయాల్లో నిర్వహించారు.

ఘనంగా ద్రౌపదీ దేవి మహాభారత ఉత్సవాలు



వరుస కట్నం అందిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు రవిచంద్రన్ తదితరులు

బలిజ కులస్తులు, కార్వేటినగరం పురవీధుల్లో ద్రౌపది అమ్మవారి ఊరేగింపు

వెదురుకుప్పం, జూలై 6(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ద్రౌపది దేవి మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. బలిజ కులస్తులు వరుస పళ్లెంను తీసుకొచ్చి ఆలయ నిర్వాహకులకు అందజేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం జరిగింది. ఉత్సవమూర్తులతో సహా విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. ఇంటింటా కర్పూర హారతులతో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షుడు మేకం రవిచంద్రన్, ప్రధానకార్యదర్శి బి.గౌతమ్‌రాజు, ఉపాధ్యక్షులు కె.దేవరెడ్డి, కోశాధికారి కె.లక్ష్మీపతి, ఉపకోశాధికారి ఆర్.సాయి రాయల్ పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా సీతారాముల కల్యాణోత్సవం



వెదురుకుప్పం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం వావిలిపేను గ్రామంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సీత, రాములు, లక్ష్మణ, ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించగా, భక్తులు ఇంటింటా కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. వేదపండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన తర్వాత శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లనగోవితే బజనలు చేసినట్లు తెలిపారు. కార్యనిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సమ్మెను జయప్రదం చేయండి

చిత్తూరు అర్బన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 9న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు నాగరాజన్, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ప్రభావతి, ప్రధాన కార్యదర్శి ప్రేమ, కోశాధికారి అరుణ కోరారు. ఆదివారం సమ్మె నోటీసును ఐసీడీఎస్ అధికారులకు అందించారు. వారు మాట్లాడుతూ చిత్తూరులో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



చెక్కును అందిస్తున్న దాత

ఐరాల(కాణిపాకం), జూలై 6(ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి చిత్తూరుకు చెందిన చిన్నస్వామి నాయుడు రూ.1,00,116 విరాళంగా ఆదివారం చెక్కు రూపంలో అందించారు. విరాళదాతకు ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దాతను వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



పీర్ల ఊరేగింపులో పాల్గొన్న ముస్లింలు

చిత్తూరు కల్చరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలోని ముస్లింలు ఆదివారం మొహర్రంను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. స్థానిక మార్కెట్ చౌక్ పెద్ద పీర్ల చావడిలో ముస్లిం మతపెద్దలు ప్రతిష్ఠించిన పీర్లను నగరవాసులు మతాలకతీతంగా దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. నగర వీధుల్లో పీర్లను ఊరేగించారు. భక్తులు పీర్లకు పూజలు చేసి కానుకలు సమర్పించుకున్నారు. నిర్వాహకులు అన్నదానాలు చేశారు.

అగరంపేటలో...



అలంకరించిన పీర్లు

నిండ్ర, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అగరం పంచాయతీ అగరంపేటలో మొహర్రం వేడుకలు ఆదివారంతో వైభవంగా ముగిశాయి. శనివారం రాత్రి అగ్నిగుండ ప్రవేశం నిర్వహించి, పీర్లను ఊరేగింపుగా తీసుకెళ్లారు.

ఉత్సాహంగా శాస్త్రీయ నృత్య ప్రదర్శన పోటీలు



అలరిస్తున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

చిత్తూరు కల్చరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): స్థానిక రెవెన్యూ భవన్‌లో ఆదివారం ప్రజాహిత సేవాసంస్థ, మాదిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో శాస్త్రీయ నృత్య ప్రదర్శన పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పోటీలను లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఓం శ్రీధర్‌రెడ్డి ప్రారంభించగా, న్యాయ నిర్ణేతగా నాట్యాచారుడు కోడి కిషోర్ వ్యవహరించారు. ఉదయం జూనియర్స్ విభాగంలో 28 మంది, సాయంత్రం సీనియర్స్ విభాగంలో 19 మంది పాల్గొన్నారు. వీరిలో ఒక్కో విభాగంలో 15 మందిని ఎంపిక చేశారు. వీరికి ఈనెల 13న ప్రీ ఫైనల్స్, 20న సెమీ ఫైనల్స్, 27న ఫైనల్స్ పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు రాజశేఖర్‌రెడ్డి, విజయసింహారెడ్డి తెలిపారు. పోటీల్లో ఎలిమినేట్ అయిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

వైసీపీ నేతల సమావేశం

పూతలపట్టు/బంగారుపాళ్యం, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఈ నెల 9న బంగారుపాళ్యంలో నిర్వహించే వైసీపీ నేత జగన్ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నేతలు కోరారు. దీనిపై మండలంలోని పికత్తలకోట సమీపాన గల ఓ కల్యాణ మండపంలో ఆదివారం వైసీపీ నేతలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్, నియోజకవర్గ పరిశీలకులు రెడ్డప్ప, నాయకులు మోహన్ రెడ్డి, పోలవరం సుధాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గోపాలి సుబ్బారెడ్డి, జడ్పీటీసీ దేవిక, అమర్‌నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ● బంగారుపాళ్యం మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పాలేరులో మామిడి రైతులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు సునీల్ కుమార్, లలిత కుమారి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైర్మన్ ఎంపీ కుమార్‌రాజా, వైస్ ఎంపీపీ శివకేశ్, నాయకులు దిల్లాత్ యరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, ప్రభునాయుడు, దామస్, సర్దార్, కామరాజు, కిషోర్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధురాలిపై వీధి కుక్కల దాడి

శ్రీరంగరాజపురం, జూలై 6(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలిపై వీధి కుక్కలు దాడి చేయడంతో తీవ్రగాయాలపాలైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఆర్‌పురం మండలం పిళ్లారిపట్టు దళితవాడకు చెందిన రాజమ్మ ఆదివారం గ్రామానికి ఆనుకుని ఉన్న ఓ చిన్న కుర్రాని ఉండగా, అటువైపుగా వెళ్తున్న వీధి కుక్కలు ఒక్కసారిగా ఆమెపై దాడి చేశాయి. వెంటనే గ్రామస్థులు వచ్చి తోలడంతో కుక్కలు వెళ్లిపోయాయి. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రాజమ్మను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం 108లో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

తవణంపల్లె, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలు. బంగారుపాళ్యం మండలం చెందిన ఢిల్లీ తన ట్రాక్టర్‌లో అరగొండ వైపు మామిడి కాయల లోడుతో వస్తూ అరగొండ సమీపంలోని అర్లగిరి ఆర్చ్ వద్ద అరగొండ నుంచి మాధవరం వెళుతున్న ఆటోను ఢీకొన్నాడు. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న దయారెడ్డి, దిలీప్‌రెడ్డి, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై తవణంపల్లె పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఉద్యోగ విరమణ సన్మానం

పాలసముద్రం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బలిజకండ్రిగ హైస్కూల్లో హెచ్ఎంగా పనిచేస్తున్న రఘు ఉద్యోగ విరమణ చేయడంతో ఆదివారం టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు ఉద్యోగ విరమణ చేస్తున్న హెచ్ఎంను శాలువ కప్పి, పూలమాలవేసి సన్మానించారు. అనంతరం చిట్టిబాబు నాయుడు మాట్లాడుతూ 42 ఏళ్లుగా టీచర్‌గా, హెచ్ఎంగా రఘు చేసిన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎంలు లింగమూర్తి, స్వామిరాజు, రామస్వామిరాజు, ఎస్ఎంసీ చైర్మన్ నాయకులు దేవయ్య, కోదండయ్య, ప్రకాష్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పదవీ విరమణ చేస్తున్న హెచ్ఎం రఘును సన్మానిస్తున్న భీమనేని చిట్టిబాబు నాయుడు



చిల్డ్రన్ పార్కులో ఏర్పాటు చేసిన కమాండో నైక్, ట్రీ క్లైంబింగ్, రోప్‌వే పరికరాలు

చిల్డ్రన్స్ పార్కులో.. ఆహ్లాదం.. వినోదం.. ఆనందం..!



బ్యాలెన్సింగ్ వాక్, నెంబరు వాక్ చేస్తున్న చిన్నారులు

చిత్తూరు సెంట్రల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని చిల్డ్రన్ పార్కును అటవీ శాఖ అధికారులు ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. తూర్పు డివిజన్ పరిధిలోని చిల్డ్రన్ పార్క్‌లో జిల్లా కలెక్టర్ నిధుల నుంచి రూ.9.90 లక్షలతో పలు రకాలైన ఆటవస్తువులు, అడ్వెంచర్ ఏర్పాటు చేశారు. చిన్నారులకు ఆటలతో పాటు వినోదం, ఆనందం పంచే విధంగా పార్కులో కమాండో స్లైక్, ట్రీ క్లైంబింగ్, రోప్‌వే, ట్రీస్టెప్స్, బ్యాలెన్సింగ్ వాక్, నెంబరు వాక్ వంటి అడ్వెంచర్లు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా చిన్నారుల్లో ఆలోచనా శక్తి, శారీరక ధృఢత్వం, మానసిక ఉల్లాసం, మనోస్థైర్యం కలిగించే వీలుంది. ఈ పార్కు చిన్నారులకు అందుబాటులోకి రావడంతో సెలవు రోజుల్లో ఈ ప్రాంతం సందడిగా మారింది. దీంతో ఈ ప్రాంతాన్ని 'నో ప్లాస్టిక్ జోన్'గా ప్రకటించారు. ప్రణాళికాబద్ధంగా పార్కును తీర్చిదిద్దడానికి కృషిచేసిన డీఎఫ్‌వో భరణి, ఎఫ్ఆర్‌వో థామస్ సుకుమార్‌లను కలెక్టర్ సుమిత్ కుమార్ అభినందించారు.

ధర్మరాజు తిరునాళ్లలో పాల్గొన్న ఎమ్మెల్యే



కృష్ణారామాపురంలో ఎమ్మెల్యే భానుప్రకాష్‌ను సన్మానిస్తున్న గ్రామస్థులు

నగరి, జూలై 6(ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని కృష్ణారామాపురంలో జరుగుతున్న ద్రౌపది సమేత ధర్మరాజు తిరునాళ్లలో ఆదివారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. బాణసంచా పేలుళ్ల మధ్య డప్పులు, మంగళవాయిద్యాలతో గ్రామస్థులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన ద్రౌపది సమేత ధర్మరాజులను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పూజారి ఆలయ మర్యాదలతో ఆయన్ను సత్కరించారు. గ్రామస్థులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. రాత్రి ఏడు గంటలకు కాపుకట్టిన భక్తులు భక్తి శ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యదర్శి బాలాజీ, రాష్ట్ర వన్నియ కుల క్షత్రియ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు జవహర్‌రెడ్డి, నాయకులు కుమార్ నాయుడు, గిరి నాయుడు, భూపాల్, మురళి, నరేష్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలన అద్భుతం: టీడీపీ



కరపత్రాలు పంచుతున్న టీడీపీ నేతలు

పెనుమూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సుపరిపాలన అద్భుతంగా ఉందని ప్రజలు హర్షిస్తున్నారని టీడీపీ నేతలు తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి పాలన ఎలా ఉందని అడిగి, పింఛను రూ.4 వేలు దేశంలో ఎక్కడా లేదని, ఏడాదికి మూడు సిలిండర్ల పథకం మహిళలకు చేయూతనిస్తుందని ప్రజలు తెలిపారు. పాలన సంక్షేమంలో ముందంజలో ఉందని ప్రజలు చెబుతున్నారని వారు అభిప్రాయాలను నాయకులు టీడీపీ యాప్‌లో నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు రుద్రయ్య నాయుడు, రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యనిర్వాహక కార్యదర్శి లోకనాథ నాయుడు, నాయకులు తలారి రెడ్డెప్ప, యోగానాయుడు, చిన్నిబాబు దొరస్వామి నాయుడు, బాబు నాయుడు, చంద్రబాబు, శంకర్‌రావు, రాజగోపాల్ నాయుడు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిలర్‌కు సన్మానం



రామ్మూర్తియాదవ్‌ను సన్మానిస్తున్న నేతలు

నగరి, జూలై 6(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కౌన్సిలర్‌గా నియమించబడిన నగరికి చెందిన సీనియర్ నేత రామ్మూర్తియాదవ్‌ను ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. గత 40 సంవత్సరాలుగా రామ్మూర్తియాదవ్ పార్టీ కోసం చేసిన సేవలను గుర్తించి నేడు బీజేపీ రాష్ట్ర కౌన్సిలర్‌గా ఆయనను నియమించడం ఆనందదాయకమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ నాయుడు పేర్కొన్నారు. పలువురు బీజేపీ నాయకులు రామ్మూర్తి యాదవ్‌ను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. రామ్మూర్తియాదవ్ మాట్లాడుతూ తనకు ఈ పదవి వచ్చేలా కృషి చేసిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిలకం ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షులు జగదీష్ నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణ, హరి, గిరి, సుబ్రమణ్యం, చిట్టిబాబు, సుబ్రమణ్యంరాజు, శివకుమార్‌యాదవ్, బాలప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం

● హంస వాహనంపై ఊరేగిన కోదండరాముడు



ధ్వజారోహణం పూజలు చేస్తున్న అర్చకులు, హంస వాహనంపై కోదండరాముడు

తవణంపల్లె, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని టిపుత్తూరు కోదండరామాలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ఆలయ అర్చకులు సప్తదేవతలను ఆవాహనంచి వైభవంగా ధ్వజారోహణం గావించారు. అనంతరం మూలవిరాట్లకు ప్రత్యేక పూజలు, తిరుమంజనం, పాలాభిషేకం నిర్వహించారు. సాయంత్రం ఉంజలసేవ నిర్వహించి, స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి మేళతాళాల నడుమ హంస వాహనంపై టిపుత్తూరు పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. ఆలయ ధర్మకర్త సిద్ధేశ్వర్‌రెడ్డి, ఉభయదారులు, టిపుత్తూరు, పరిసర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు పెంచాలి

నగరి, జూలై 6(ఆంధ్రజ్యోతి): గత పది రోజులుగా సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు పెంచాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. నగరి మున్సిపల్ కార్మికుల విస్తృతస్థాయి సమావేశం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం జరిగింది. చిత్తూరు జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కోదండయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పీఎఫ్ చెల్లించి చనిపోయిన కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మురళి, నాగరాజు, సతీష్, దశరథ, సుబ్రమణ్యం, వెంకటేశ్వర్లు, కుమరేశన్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

పాలసముద్రం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు నెరవేర్చాలని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. ఆదివారం పాలసముద్రంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ కృపాలక్ష్మి, మండల వైసీపీ కన్వీనర్ తులసీయాదవ్, జడ్పీటీసీ అన్ను, నేతలు కేశవరెడ్డి, పోలయ్య, అయ్యప్ప, మహేష్‌నాయుడు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు వ్యాక్సినేషన్



కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్యాధికారులు

నగరి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్క కాటుకు గురైన బాలుడికి 1885 జూలై6న వ్యాధి రాకుండా నిరోధక టీకాను విజయవంతంగా ఇచ్చినందున నాటి నుంచి నేటి వరకు జూలై 6వ తేదీని ప్రపంచ జూనోసిస్ దినోత్సవం జరుపుకుంటున్నట్లు పశువైద్యశాఖాధికారి వాసు తెలిపారు. నగరి పట్టణంలోని పెంపుడు కుక్కలకు వ్యాక్సినేషన్ ఇచ్చినట్లు ఆయన చెప్పారు. ● శ్రీరంగరాజపురం (ఆంధ్రజ్యోతి): పెంపుడు జంతువులకు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ శ్రీవిద్య అన్నారు. తయ్యూరు పశువైద్య కేంద్రంలో పెంపుడు జంతువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జంతువులకు ఆరోగ్యమైన జీవనం కోసం వ్యాధి నివారణ టీకాలను వేయించుకోవాలని సూచించారు. తయ్యూరు పశువైద్యశాలలో ఈ టీకాలు ఉన్నాయని ఆమె తెలిపారు.

లక్ష్మీనారాయణుడికి ప్రత్యేక పూజలు

గంగాధరనెల్లూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): వేపంజేరిలోని లక్ష్మీ నారాయణస్వామి, కోనేటివద్ద గల సంతాన వెంకటేశ్వర స్వామి, వైకుంఠనాథ స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. తొలి ఏకాదశి సందర్భంగా వేపంజేరిలో వెలసిన లక్ష్మీ నారాయణస్వామి, కోనేటి వద్ద గల సంతాన వెంకటేశ్వరస్వామి, వైకుంఠనాథస్వామివారికి పట్టువస్త్రాలు, పుష్పహారాలు అలంకరించి, అర్చకుల వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టుకు చెందిన భాగవతారిణి రంజితమ్మ హరికథా కాలక్షేపం చేయగా, వెంకటేశ్వర భక్తిగీతాలు, అన్నమయ్య కీర్తనలను రాజేష్ ఆలపించారు. ఉభయకర్తలుగా అర్చకులు విష్ణుస్వామి, ద్వివేది, గోవిందస్వామి, భక్తులు పాల్గొన్నారు.

గురువు లేనిదే జ్ఞాన సముపార్జన లేదు

చిత్తూరు కల్చరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి వ్యక్తి జ్ఞాన సముపార్జనకు గురువు ప్రధానమని శివగిరి పీఠాధిపతి అప్రమేయానందగిరి స్వామి అన్నారు. ఆదివారం స్థానిక రామకృష్ణాశ్రమంలో నగర సిద్ధి సమాధి యోగ సంస్థ ఆధ్వర్యంలో గురు పూజోత్సవం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న అప్రమేయానందగిరి స్వామి మాట్లాడుతూ వ్యాస పౌర్ణమిని గురు పూజోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. సిద్ధి సమాధి యోగా గురువు నరేంద్రకుమార్ గురుపూజోత్సవం విశిష్టతను తెలియజేశారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు, యోగాభ్యాసకులు స్వామిని సత్కరించారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

నిండ్ర, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరామపురం పంచాయతీకి చెందిన టీడీపీ నాయకుడు హేమాద్రి (27) జబ్బుల వల్ల మృతి చెందాడు. ఆదివారం నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. హేమాద్రి మృతి చెందడం బాధాకరమన్నారు. పరామర్శించిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరాజు, కొప్పేడు ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, నాయకులు ముకేశ్ యాదవ్, మనోహర్ నాయుడు, జగన్, ఏజే రవికుమార్, రవి నాయుడు, చిట్టిబాబు, రఘురాం, దయాళన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మాతమ్మ అగ్నిగుండ ప్రవేశం

నిండ్ర, జూలై 6(ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా నిర్వహించిన మాతమ్మ తిరునాళ్ల ఆదివారం అగ్నిగుండ ప్రవేశంతో ముగిసింది. మండలంలోని శ్రీరామపురం పంచాయతీ పెద్దపట్టెడ, ఎంకాటూరు పంచాయతీ, మిట్టూరు, అరిజంబ్రవాడలో మాతమ్మ తిరునాళ్లు ఘనంగా నిర్వహించారు. మాతమ్మ ఉత్సవ విగ్రహాన్ని విశేషంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు.

గంజాయి సాగు, మద్యం అక్రమ విక్రయాలపై దాడులు

చిత్తూరు అర్బన్, జూలై 6: రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో గంజాయి సాగు, మద్యం అక్రమ విక్రయాలపై పోలీసులు ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. నగరంలోని ఇరువారం, వైఎస్సార్‌కాలనీ ఆటోస్టాండ్, కైలాసపురం, నాగాలమ్మ గుడి వద్ద, రాజాగుడి వెనుకభాగంలో, పోతంబట్టు మామిడితోప్పు, పాడుబడిన భవనాలు, తేనెబండ అమ్మవారిగుడి, రాజుగుడి సమీపాల్లో, బాలాజీ బట్టు ప్రాంతంలో పోలీసులు ఆకస్మిక దాడులు చేశారు. మామిడి తోటల్లో కలియ తిరిగి ఎక్కడైనా గంజాయి సాగు చేస్తున్నారా అని ఆరా తీశారు. ఇటీవల కాలంలో పాడుబడిన భవనాల్లో కూర్చుని గంజాయి, అక్రమ మద్యం సేవిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ రవిచంద్రబాబు స్థానికులతో మాట్లాడుతూ గంజాయి సాగు, విక్రయాలు జరిపితే కఠినంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

వైసీపీ నిరసన



నిరసన తెలుపుతున్న వైసీపీ నాయకులు

నగరి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నగరి వైసీపీ కార్యాలయంలో రీకాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టో అంటూ మాజీమంత్రి రోజా, మాజీ ఎమ్మెల్యే కరుణాకరరెడ్డిల ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు ఆదివారం నిరసన తెలిపారు. నగరి నియోజకవర్గంలోని ఐదు మండలాల వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు గుడిపాలలో 'ఇంటింటికి మీ ఎమ్మెల్యే'

చిత్తూరు సిటీ, జూలై 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన 'ఇంటింటికీ మీ ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ గుడిపాల మండలంలో పర్యటించనున్నారు. ఉదయం 8గంటలకు నాగగల్లు, 11గంటలకు ఆదికేశవపురం, మధ్యాహ్నం 3గంటలకు వెంగమాంబాపురం, 5గంటలకు 197రామాపురంలో పర్యటిస్తారు.